**కథ**

# సప్త సముద్రాల ఆవల

**"ఏమిటి వైష్ణవీ, అంత పరధ్యానంగా కూర్చున్నావ్?" అంటూ భార్య సరసన కూర్చున్నాడాయన.**

**"ఏం లేదండీ. ఈరోజు కూడా కిరణ్ ఫోన్ చేయలేదు. పది రోజులవుతోంది."**

**"పాపం వాడికేం ప్రాబ్లమ్స్ ఉన్నాయో ఏమో, తీరిక లేక చేసుండడు. లే పద, ఆకలిగా ఉంది భోజనం చేద్దాం" భార్య చెయ్యి పట్టి లేవదీశాడాయన.**

కొత్తలో నాలుగు రోజులకోసారి చేసే ఫోనులు, ఆదివారం ఆదివారం మోగుతున్నాయి. ఇపుడు అదే వారం అయ్యేసరికి బెంగగా ఉంది ఆ జంటకు. చరణ్ మాత్రం నాలుగు రోజులకోసారి చేస్తాడు టంఛనుగా.

అన్నం వడ్డిస్తున్న భార్య కళ్లు ఒత్తుకోవటం చూస్తే ఆయన గుండెలో ముల్లు దిగినట్లయింది.

"ఊరుకో వైష్ణవీ. ఎందుకే అంత దిగులు పెట్టుకుంటావు. మళ్లీ నీకు హెల్త్ ప్రాబ్లమ్ ఏదైనా వస్తే నేను తట్టుకోగలనా?"

భర్త కళ్లల్లో నీళ్లు చూసిన వైష్ణవి తొందరగా కళ్లు తుడుచుకుంది.

"ఏం లేదండీ. ఏదో జ్ఞాపకం వచ్చి."

"ఏమిటదీ?" పప్పు కలుపుకుంటూ అడిగేడాయన.

"ఆరు కుర్చీల డైనింగ్ టేబిల్ కొన్నారు. కొడుకులూ, కోడళ్లూ, మనం కలిసి తింటే సరిపోవాలని..."

"ఊ" మూలిగేడాయన.

"ఏమిటో వైష్ణవీ, మనిద్దరం మిగిలాం?" బాధగా అన్నాడాయన.

"పోనీలెండి. మీకు నేను, నాకు మీరు. మనకు బాధెందుకూ? పెళ్లైన కొత్తలో మీకు కలకత్తా ట్రాన్స్‌ఫరైతే రెండేళ్లు ఇద్దరమే లేమూ ఒంటరిగా?"

"అవునవును అప్పుడే పెద్దాడు కిరణ్ పుట్టాడు కదూ!"

"విజయవాడకు వచ్చేసేక చరణ్ పుట్టేడు."

భోజనం ముగించి ఎదురుగా టీవీపై ఉన్న కొడుకులిద్దరి ఫోటో తీసి టవల్‌తో తుడుస్తూ అన్నాడాయన. అతడి కళ్లల్లో సన్నటి నీటి పొర.

వైష్ణవికి ధైర్యం చెబుతున్నా ఆయన గుండె అనుక్షణం లబ్ డబ్‌కి బదులు కిరణ్-చరణ్ అని కొట్టుకుంటోంది.

* * *

"వైష్ణవీ!" భర్త పిలుపునకు తలుపు తీసింది. అతడు రోజూ మార్నింగ్ వాక్‌కు వెళ్లి వస్తాడు. వచ్చేసరికి కాఫీ రెడీగా ఉండాలి. తాగుతూ పేపర్ చదువుకోవటం అలవాటు. ఆ రోజింకా కాఫీ అయినా తయారవ్వకుండానే అతడు వెనక్కు వచ్చేయటంతో "ఏమండీ ఈరోజు తొందరగా వచ్చేశారు?" అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది.

ప్రసాదరావు కళ్లు మూసుకుని పడుకొని ఉండటంతో కాఫీ కప్పు టేబిల్‌పై ఉంచి "అలా పడుకున్నారే, ఒంట్లో ఎలా ఉందండీ?"

చిన్నగా కళ్లు తెరిచి చూసిన ఆయన నెమ్మదిగా అన్నాడు.

"ఏదో ఆయాసంగా అనిపిస్తుంది. ఉండండి గుండె వేగంగా కొట్టుకుంటున్న ఫీలింగ్."

"కాఫీ తాగండి తగ్గుతుంది" అని కాఫీ అందించింది.

డాక్టర్‌కు ఫోన్ చేసింది ఒక్కసారి వచ్చి చూడమని. డాక్టర్ స్టెత్‌తో చూసి చివరకు చెప్పాడు.

"హార్ట్ బీట్‌లో తేడా వస్తోందమ్మా, కార్డియాలజిస్ట్ చూస్తే మంచిది" అన్నాడు.

పెద్ద హాస్పిటల్‌కు తీసుకువెళ్లిందామె. ఎన్నో టెస్టులు చేసి రెండు మూడు రోజులు, చివరకు చెప్పాడు ఆయన.

"పేస్‌మేకర్ పెట్టాలమ్మా ఆపరేషన్ చేసి."

దిగులుగా దిక్కు తోచక కూర్చుని ఉందామె. మనసులో బాధ చెప్పుకుందాం అన్నా కన్నవాళ్లిద్దరూ సప్త సముద్రాల ఆవలే ఉన్నారు.

తెలిసిన వాళ్లందరూ "మీకేమండీ, ఇద్దరు కొడుకులూ అమెరికాలో ఉన్నారు" అంటారు.

ఆ బాధ అనుభవించే వాళ్లకేగానీ తెలియదు.

ఆమె కళ్లు అప్రయత్నంగా వర్షించసాగాయి.

అంతలో ఫోను మోగింది.

కిరణ్ "ఏం అమ్మా బాగున్నారా?" అడిగేడు.

విషయం అంతా చెప్పింది, డాక్టర్ చెప్పినట్లే.

"ఈ ఏజ్‌లో ఆపరేషనా నాన్నగారికి?" బాధగా అన్నాడు.

"వెంటనే ఎడ్మిట్ చేయమన్నారు. నాకు కాళ్లూ, చేతులూ ఆడటం లేదురా."

"భయపడకమ్మా. ఈ రోజులలో ఆపరేషన్లు ఈజీగా చేసేస్తున్నారు. మళ్లీ రేపు చేస్తానమ్మా. నాన్నకు చెప్పు. వర్రీ అవ్వకండి."

పెట్టేసి అక్కడే కుర్చీలో కూలబడిందామె. ఫోను మళ్లీ మోగింది. చరణ్ చేశాడు.

"అమ్మా, ఇందుకేనమ్మా మిమ్మల్ని వదిలి వెళ్లాలనుకోలేదు" దుఃఖంతో పూడిపోయింది అతడి కంఠం.

"నాకు సెలవు ఇవ్వరమ్మా ఎలా? మొన్నేగా చేరేను" దిగులుగా అన్నాడు.

"వద్దులే నాయనా. కిరణ్ వస్తాడులే" అందామె.

* * *

దిక్కు తోచక అన్నగార్కి ఉత్తరం రాసి రప్పించిందామె. విషయం విన్న సుందరయ్య బాధపడ్డాడు.

"పోనీ మన ఇందిరమ్మని వచ్చేయమందావా?" అన్నాడతడు.

"మాటలా అన్నయ్యా? ఇంకా నెలైనా కాలేదు" దిగులుగా అందామె.

ఇద్దరూ కలిసి ప్రసాదరావును హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేశారు. ఇంకేవేవో టెస్టులు, సంప్రదింపులూ అయ్యేక చెప్పారు.

దగ్గర దగ్గర రెండు లక్షలు అవుతుంది. ఆపరేషన్ ముందూ, తర్వాత హాస్పిటల్ ఖర్చులూ అన్నీ కలిపి.

'రెండు లక్షలా!' అనుకుందామె. వీళ్లు వెంటనే కట్టమన్నా రెడీగా లేదు అంత డబ్బు.

'కిరణ్ ఫోను చేస్తాడుగా!' అనుకుందామె ధీమాగా.

ఆ రాత్రి విషయం విన్న కిరణ్ "అదేంటమ్మా అంతెందుకు? డాక్టర్లలాగే చెప్తారు. అంత కాస్ట్లీ వి అక్కర్లేదమ్మా. 25 వేలకదీ ఉంటాయి. అడుగమ్మా."

డాక్టరుగార్ని అలాగే అడిగింది ఆమె.

విన్న డాక్టరు హేళనగా నవ్వేడు. "అలా ఉండదమ్మా, ఒకసారి వేస్తే లైఫ్ టైమ్ అమ్మా."

తిరిగి కొడుకుకు చెప్పింది.

దానికి కొడుకు చెప్పిన మాటకు నివ్వెరపోయిందామె.

"చిన్న పిల్లలకు, లైఫ్ స్పాన్ ఎక్కువ ఉన్నవాళ్లకి అంత కాస్ట్లీ అవుతుందమ్మా, కానీ డాడీ ఏజ్ ఆల్‌మోస్ట్ సెవెంటీ కదా..."

ఇక ఆపైన కిరణ్ మాటలు వినపడలేదు ఆమెకు. నిండిన కన్నీళ్లు చెంపల మీదకు కారుతుంటే ఫోను పెట్టేసింది.

* * *

ఆమె మొద్దుబారిన మెదడు గతంలోకి పరుగుతీసింది.

"నాకు ఆ సైకిలే కావాలమ్మా!"

"పదివేలు ఎక్కువైనా ఆ మోటారుసైకిలే కావాలమ్మా."

కొడుకు కళ్లలో ఆనందం చూడాలని ఎప్పటికప్పుడు అతడి కోరికలు తీర్చేడాయన.

"అమెరికా వెళ్లిపోతేగానీ ఉద్యోగాలుండవా? మా కళ్లె

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**

ద ం

టుంటావ్. హైటెక్‌లో వస్తుందన్నావుగా. అందులో చేరు.''

అన్నం వడ్డిస్తున్న తల్లి వైపు కోపంగా చూసేడు.

''ఇక్కడ మహా అయితే నలభై ఇచ్చె, యాభై ఇచ్చె. అక్కడైతే నెలకు దగ్గర దగ్గర మూడు లక్షలు వస్తాయి.''


వాడు అంత కోరుకుంటున్నప్పుడు కాదనటం ఎందుకని, దాచినవీ, దొరికనివీ డబ్బంతా చేర్చి అమెరికాకు పంపించారు ఎలాగో.

''ఈ కష్టాలు అన్నీ తీరిపోతాయి. ఎంత డబ్బు పంపిస్తానో చూడు నేను అమెరికా నుంచి'' వెళ్లేరోజు చెప్పేడు.

కొని తెచ్చుకున్న వస్తువులన్నీ సూట్‌కేసులో సర్దుకుంటున్న కొడుకు దగ్గర కూర్చున్నారు వైష్ణవి, ప్రసాదరావు.

''నీకు మంచినీళ్లు ముంచుకు తాగటం కూడా రాదు. అక్కడ ఎలా తింటావో ఏమో!'' దిగులుగా అంది ఆమె.

''అన్నీ అవే బాగుంటాయమ్మా'' తేలికగా అంటున్న కొడుకును ఆశ్చర్యంగా చూసింది ఆమె.



★ ★ ★

సాయంకాలం ఫ్లైట్ అనగా వచ్చేవారు, పోయేవారు. అసలు మాట్లాడుకోవటానికే లేదు.

చిన్న చిన్న పాకెట్లు అమెరికాలో తమవాళ్లకిమ్మని తెచ్చేవాళ్లు.

''బరువు ఎక్కువవుతుందమ్మా'' అంటూ వడియాలు, ఊరుమిరపకాయలు పాకెట్ తీసేశాడు.

ఆమె మనసు నొచ్చుకుంది. ఎవరో ముక్కూ ముఖం తెలియనివాళ్ల కోసం తనెంతో అపురూపంగా ప్రేమగా ఇచ్చినవి వదిలేసినందుకు.

కిరణ్ ఎక్కిన విమానం దూరదూరంగా ఎగిరిపోతుంటే, తన గుండెను శరీరం నుంచి వేరుచేసి ఎవరో దూరంగా తీసుకుపోతున్నంత బాధ కలిగింది ఆయనకు.

చిన్నబోయిన ఇంట్లో తను బాధపడితే భార్య కూడా బాధపడుతుందని ధైర్యం నటించిన ప్రసాదరావు బాత్‌రూమ్‌లో తనవితీరా ఏడ్చి గుండె బరువు దించుకున్నాడు.

★ ★ ★

రెండేళ్ల తర్వాత వచ్చిన కొడుకు కిరణ్‌తో కోడలు కూడా వచ్చింది.

''అమ్మా నేనీ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాను'' అని చూపించేడు తీసుకొచ్చి.

ఆ అమ్మాయి టైట్ ప్యాంట్లవీ వైష్ణవికి నచ్చలేదు. బాగుండదని ఏదో పలకరించింది.

''మమ్మీ వీళ్ల ఫ్యామిలీ ఇరవై ఏళ్ల క్రితమే అమెరికాలో సెటిలయిపోయేరు'' చెప్పాడు కొడుకు.

''పెళ్లి అక్కడే అన్నారు వాళ్లు. మీరెలాగా రాలేరని పిలవలేదు పెళ్లికి'' సంజాయిషీ ఇచ్చేడు.

ప్రసాదరావు మౌనంగా ఉండిపోయేడు.

''ఏవో ఇంటి అడ్వాన్సులు, కారు ఖర్చులూ, హెల్త్ కార్డ్స్, అవీ ఇవీ చాలా టైట్ అమ్మా!'' పది రోజులుండి వెళ్లిపోయేరు.

ఎప్పుడూ అదే మాట.

చరణ్ ఏవో కోర్సులకు ఫీజు కట్టాలన్నా అదే మాట!

ఆఖరుకు ఇప్పుడు తండ్రికి ఆపరేషన్ అన్నా అదే మాట.

''నా దగ్గర ఇంతకంటే లేదమ్మా. మిగిలింది మీరు సర్దుకోవచ్చుగా'' అన్నాడు లక్ష రూపాయలు పంపించి.

''ఎలారా?'' అంటే, ''ఏం చెయ్యనమ్మా ఓ ప్రక్క మా బాధలు మాకున్నాయి. మా ఉద్యోగాలు ఎన్నాళ్లుంటాయో తెలియటం లేదు.''

''అదేం అలా అంటావేంటిరా కిరణ్!'' ఆందోళనగా అడిగింది తల్లి వైష్ణవి.

''నేను చదివిన చదువు చాలదమ్మా. అందుకే ఇక్కడ ఇంకా చదువుతున్నాను. పరీక్ష రాసేను. నాకే చాలా ఖర్చయిపోయింది. ఇప్పుడు 'సుష్మ' ప్రెపేరవుతోంది. ఫీజ్ కట్టాలి. లక్షలే అవుతుందమ్మా.''

నోట మాట రాలేదు ఆమెకు.

'ఎంత డబ్బు పంపిస్తానో చూడు. బాధలు, తిప్పలూ అన్నీ వదిలిపోతాయి' అని చెప్పిన కొడుకేనా!

''సరేరా...పాపం...నీ బాధలు నీవి'' అని ఫోన్ పెట్టేసింది.

''ఏమంటాడు పెద్దాడు?''

అడుగుతున్న ప్రసాదరావు దగ్గరకు ముఖం ప్రసన్నంగా మార్చుకు వెళ్లింది. ఆలోగా నర్సు వచ్చి ఏవో టాబ్లెట్స్ అవీ ఇచ్చింది.

''మీ ఆపరేషన్ వచ్చే మంగళవారం ఉదయం ఫిక్స్ చేశారు సర్'' అని చెప్పి వెళ్లిపోయింది.

దిగులుగా భార్య ముఖంలోకి చూసేడు. ఆమె కళ్లలో నీళ్లు చూసిన ప్రసాదరావు ''అమ్మయ్య, ఆ ఆపరేషన్ ఏదో అయిపోతే, ఈ హాస్పిటల్ బాధ తప్పుతుంది. మనింటికి వెళ్లిపోవచ్చు'' తేలికగా నవ్వుతూ అన్నాడు.

''వైష్ణవీ రాత్రి పిల్లలు ఫోన్ చేస్తే నేను ఒకసారి వాళ్లతో మాట్లాడాలి. వీల్‌చైర్‌లో తీసుకెళ్లు. ప్లీజ్'' చిన్నపిల్లాడిలా బ్రతిమాలుతున్న భర్తతో ''సరే'' అంది. కానీ కిరణ్ ఏం మాట్లాడి భర్త మనసుకు నొప్పిస్తాడోనని భయపడింది.

అలాగే ఫోన్ దగ్గరకు తీసుకెళ్లింది డాక్టర్ పర్మిషన్‌తో. ముందు చిన్న కొడుకు ఫోన్ వచ్చింది.

చరణ్ తండ్రికి ధైర్యం చెప్పాడు. అక్కడ వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్లి ఆయన పేర పూజ చేయించేననీ,

కె. రాణి

తప్పక నయమవుతుందనీ చెప్పేడు. చరణ్ భార్య, బావ మరిది సుందరయ్య కూతురు ఇందిర ఎంతో బాధ పడింది టైమ్‌కు దగ్గర లేకపోయానే అని.

"చరణ్, బాబూ.. మధ్యలో అడ్డు చెప్పకుండా నే చెప్పేది పూర్తిగా విను నాయనా" భర్త, కొడుకుకు ఏం చెప్తాడోనని ఆత్రంగా చూస్తున్న వైష్ణవి మనసు పిండినట్ల యింది.

"ఆపరేషన్ సక్సెస్ అవుతుందని డాక్టర్లూ, మీరూ, నేనూ అందరం అనుకుంటున్నాం. కానీ ఒన్ పర్సెంట్, పైవాడి లీల కూడా ఉంటుందిగా...ఆగు నన్ను చెప్ప నియ్యి..." ఆయాసపడ్డాడాయన కాసేపు. తిరిగి చెప్తున్న ప్రసాదరావును వారించబోయింది వైష్ణవి.

చేత్తోనే సైగ చేశాడాయన అడ్డురావద్దని.

"ఒకవేళ నాకేమైనా అయితే..ఉండు నాయనా విను...నాకేమైనా అయితే మీ అమ్మను నువ్వూ, ఇందిరా చూస్కోవాలి. పిచ్చిది పాపం, నన్ను తన కోసం ఎప్పుడూ ఏదీ అడగలేదురా మీ అమ్మ... మీ ఇద్దర్నీ గొప్పగా చూసు కోవాలనే ప్రయాస..పడింది. మీ అమ్మ పేర్న లక్ష రూపా యలు డిపాజిట్ చేశాను బ్యాంకులో. ఆ కాగి తాలు...లాయరు కృష్ణగారి దగ్గర దాచేను. ఏదో బలహీన క్షణంలో అదీ కరిగిపోతే, నే లేకుంటే అది అన్యాయం కాకూడదని, నీమీద నాకా నమ్మకం ఉంది" ఫోను పెట్టే సిన ప్రసాదరావు భార్యను దుఃఖించొద్దని ఊరడించాడు.

అటు తర్వాత పెద్దకొడుకు కిరణ్‌తో మాట్లాడేడాయన.

"మీకేం కాదు డాడీ, పేస్‌మేకర్ అంటే చేతికి వాచీ పెట్టుకున్నంత ఈజీ."

"అదే బాబూ, ఒకవేళ... ఒకవేళ నేను లేకుంటే మాట చెపుతున్నాను. ఇల్లు రెండు లక్షల అప్పులో ఉంది. ఇల్లు నీకూ, చరణ్‌కూ చెరిసగం..."

"ఇక మీ అమ్మ..." మధ్యలోనే అడ్డు వచ్చాడు కిరణ్.

"డాడీ, నేనే సుష్మా వాళ్ల పేరెంట్స్‌తో కలిసి ఉంటు న్నాను..."

"తెల్సురా, మీ అమ్మ భారం నీకు పెట్టనులే."

"అవును డాడీ, చరణ్ దగ్గర ఉంటే బాగుంటుంది అమ్మకు కూడా."

పేలవంగా నవ్వేడాయన. "అవున్రా, సరిగ్గా నేనూ అలాగే అనుకున్నాను."

"డాడీ, అసలు పెద్ద ఇంట్లో మీకు కష్టంగా లేదూ, అది అమ్మేసి చిన్న ఇల్లు తీసుకుంటే బెటర్ ఏ రెంట్‌కో."

చిన్నప్పట్నుంచీ కిరణ్ గుండెలలో పొడిచి నట్టు పెట్టిన సమస్యలూ, అడిన మాటలూ చిన్నవే.

ఇది గునపంతో పొడిచినట్లే అనిపించింది ఆయనకు.

కొడుకు మాటలకు ప్రసాదరావుకూ, భర్త కొడుకులకు పెట్టిన అప్పగింతలకు వైష్ణవికి ఆ రాత్రంతా నిద్ర లేదు.

అతడి కాళ్లదగ్గరే కూర్చుని కాళ్లు ఒత్తుతూ కూర్చుందామె.

మర్నాడు మళ్లీ ఫోన్ చేసి చెప్పేడు కిరణ్ "అమ్మా.. వద్దాం అనుకున్నాను, కానీ అదే డేట్‌కు సుష్మ ఎగ్జామ్ పడింది. పాపం నేను లేకుంటే కష్టపడు తుంది...మామయ్య ఉన్నాడుగా..."

ఇక ఆపైన వినలేకపోయిందామె. ఫోను పెట్టేసింది. ఆమె ప్రతిసారి బాధపడకుండా ఉండాలి అని మనసు రాయి చేసుకుంది.

* * *

కొడుకు పంపిన డబ్బూ, చిన్న చితకా అన్నీ పోగేసినా లక్షా నలభై వేలే ఉన్నాయి. దేనికైనా భర్తనే సంప్రదించే ఆమెకు ఈ విషయంలో ఆ అవకాశం లేదు. ఆయన మరింత కృంగిపోతాడని ఆలోచించింది.

అన్నగార్కి అంత అవకాశం లేని స్థితి.

స్థిరంగా నిర్ణయించుకున్న వైష్ణవి బీరువా తెరిచింది. లాకర్‌లో ఉన్న నీలిరంగు వెల్‌వెట్ పెట్టె తీసింది.

తళతళ మెరుస్తున్న బరువైన నల్లపూసల గొలుసు!

భార్యను తీసుకువచ్చిన కిరణ్ అమెరికా వెళ్లేక తల్లికి చెప్పేడు ఫోనులో "అమ్మా, సుష్మకు నువ్వెంతో నచ్చావు. అమ్మా, తనకూ నల్లపూసలు నేను కొన్నాను. కానీ అవి నచ్చలేదు. నీ మెళ్లో నల్లపూసలు చాలా చాలా నచ్చే యట. అటువంటిది కావాలటమ్మా!" అని చెప్పేడు.

పెళ్లి ఎలాగూ చేసే అవకాశం లేకపోయింది. చేయిం చటం అంటే తన వల్ల కాని పని. వెంటనే మెళ్లోంచి తీసి మెరుగు పెట్టించి దాచేసింది కోడలికి ఇద్దాం అని.

అయిష్టంగానే అది చేతిలోకి తీసుకుంది. అది తనకు ప్రసాదరావు ముచ్చటపడి చేయించింది. ఆయన కోసమే వినియోగించటమే న్యాయం.

ఇంకా తన గాజులూ, వెండి సామానూ, అన్నీ పోగేసి అమ్మేసింది వైష్ణవి.

అవసరం గడిచింది.

ఆపరేషన్ అయినంతసేపు అన్నగారి ఓదార్పుతో దుఃఖిస్తూ కూర్చుంది ఆమె.

ఆమె కళ్లలో పిల్లలూ, వాళ్ల బారసాలలూ, చదువులూ, పెళ్లిళ్లూ కళ్లలో సినిమా రీలులా తిరిగేయి ఆవిడకు.

ప్రసాదరావు ఆపరేషన్ సక్సెస్ అయింది.

బిల్లు కట్టి బయటపడింది ఆమె. తననూ, భర్తనూ ఒక సారే తీసుకుపొమ్మనీ, వేరుచేయొద్దనీ దేవుళ్లకు దణ్ణం పెట్టుకుందామె.

ఫోనుల్లో క్షేమ సమాచారాలు తెలుసుకుంటున్నారు కొడుకులు.

* * *

కొడుకుల ఫోన్లు మ్రోగితే ఎక్కడ వినపడదోనని భక్తిరం జని కూడా పెట్టడు ప్రసాదరావు ఆదివారం.

కిరణ్ నుంచి ఫోను వచ్చింది.

"మమ్మీ ఈమధ్య నాకు కొంచెం ఒంట్లో బాగుండటం లేదమ్మా."

"ఏమైంది నాన్నా జ్వరమా? మందులు వేసుకుంటు న్నావా?" ఆత్రంగా అడుగుతున్న భార్య చేతిలోంచి ఫోను తీసుకున్నాడు ప్రసాదరావు కంగారుగా.

"ఏమైందిరా నాన్నా కిరణ్?" ఆత్రంగా అడిగేడాయన.

అత్తమామలతో ఎప్పుడో తప్ప మాట్లాడదు సుష్మ.

ఆమె తీసుకుంది ఫోను "బాగున్నారా మామయ్య గారూ?" అంటూ.

"నాకేమమ్మా నిక్షేపంగా ఉన్నాను. వాడికేమైంది?" గాభరాగా అడిగేడాయన.

"మీ అబ్బాయికి కిడ్నీ ట్రబుల్ వచ్చింది మామయ్యా"

"మరి మందులు అవీ జాగ్రత్తగా వాడుతున్నాడా?"

"మందులతో తగ్గదట మామయ్యా."

"మరి ఆపరేషన్ అన్నారా...అయ్యో దేవుడా!"

"ఆయన రక్తానికి సూట్ అయ్యే కిడ్నీ కావాలట మామయ్యా. ఇక్కడ ఇంకా దొరకలేదు. డాక్టర్లేమో ఆపరే షన్ తొందరగా చేయాలంటున్నారు."

"అలాగా" ఒక్కక్షణం ఆలోచించాడాయన. ఆ మధ్య తన స్నేహితుడికి కొడుకే ఇచ్చాడు కదా! "తల్లీ నా రక్తం వాడిదీ ఒకటేగా. నా కిడ్నీ ఇస్తానమ్మా. దిగులు పడొద్దని వాడికి చెప్పు. తొందరగా ఏర్పాట్లు చేయమను. ఎలా...నేను రావాలా లేక కిడ్నీ ఎలా అయినా పంపే ఏర్పా ట్లుంటాయా..."

* * *

వైష్ణవి భర్తను అడిగింది. "ఏమండీ, ఈమధ్యే గుండె ఆపరేషన్ అయింది మీకు. కిడ్నీ ఇస్తే..."

ఆమె మాటలు పూర్తి కాకుండానే ఆవేశంగా అన్నాడా యన.

"ఎవరికి ఇస్తున్నా! వాడు నా కొడుకు...నా ప్రాణం. వాడు బాగుండాలి. వాడు బాగుండాలి" కళ్లు తుడుచుకు న్నాడాయన.

తమాయించుకుని తిరిగి అన్నాడాయన.

"వైష్ణవీ... నేను వాలిపోతున్న పొద్దుని! వాడు ఉదయిస్తున్న సూర్యుడు! వాడు పది కాలాల పాటు చల్లగా ఉండాలి! చల్లగా ఉండాలి!!"

కొడుకు ఫోటో గుండెకు హత్తుకున్నాడా యన. ఆ కన్న మనసులు సప్త సముద్రాల అవల ఉన్న కొడుకు కోసం పరితపిస్తున్నాయి.

ఇది కన్నవారికి, సంతానానికి మధ్య అనా దిగా నలుగుతూ వస్తున్న అనుబంధం! ✤

